## క్లుప్తంగా

### ఆత్మరక్షణకు కరాటే దోహదం

కొందుర్గు: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మాస్టర్ రమేశ్ ఆధ్వర్యంలో కొందుర్గు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపినాథ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న ఎంవీఐ వాసు

షాద్‌నగర్: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రోడ్డు రవాణా సంస్థ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పద్మావతీ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి సాయి ప్రణతి వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతి, చిత్ర లేఖనంలో మాధురి తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ఎంవీఐ వాసు బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం భాగ్యమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

### కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న శైలేశ్‌కుమార్ అగర్వాల్

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి మంగళవారం వ్యాపారవేత్త, సౌత్ గ్లాస్ పరిశ్రమ యజమాని శైలేశ్‌కుమార్ అగర్వాల్ రూ.11లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల భవన నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విరాళానికి సంబంధించిన చెక్కును దాత అందజేశారు. అనంతరం దాతను ఎమ్మెల్యేను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, సయ్యద్ సాధిక్, శేఖర్‌గౌడ్, శేఖర్, ముబారక్, శ్రీహరి, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### పనుల్లో నాణ్యత పాటించాలి

మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు

కేశంపేట: కేశంపేట నుంచి కమ్మదనం వరకు నిర్మిస్తున్న రోడ్డు రీబీటీ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ నాణ్యత పాటించాలని కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామ శివారులో జరుగుతున్న రోడ్డు రీబీటీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో చాలా సంవత్సరాల తర్వాత రోడ్డు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చంద్రశేఖర్, గ్రామస్తులు యుగేందర్, లయఖ్, దత్తురెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: నగరంలోని రోటరీ కాన్వెంట్ హైస్కూల్‌లో 1974–75లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవాం మొయినాబాద్ మండలం పెద్దమంగళారంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చదువుకున్న రోజులను గుర్తుచేసుకొని నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.




# భోజనం.. అధ్వానం!

## ఉడికీ ఉడకని అన్నం.. ఒక్కటే కర్రీ

- మెనూ ప్రకారం అందని భోజనం
- గుడ్లు, అరటి పండ్లు లేవు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తప్పని తిప్పలు

ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడం, ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదు. మంగళవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలను 'సాక్షి' విజిట్ చేసింది. ఉడికీ ఉడకని అన్నం.. ఒకే కర్రీ వడ్డించారు. చాలా చోట్ల మెనూ పాటించడం లేదు. దీనిపై పలువురు విద్యార్థులను అడగగా.. భోజనం రుచిగా ఉండటం లేదన్నారు. చాలామంది పిల్లలు ఇళ్ల నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని తినడం కనిపించింది. నెలల తరబడి డబ్బులు రాక భోజన నిర్వహణ కష్టంగా మారిందని మహిళలు తెలిపారు.

### అప్పులు తెచ్చి.. భోజనం వడ్డించి



కొందురు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ సభ్యురాలు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెబుతున్నా అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. అరకొర బిల్లులు, సకాలంలో అందని వేతనాలతో వంట ఏజెన్సీ సభ్యులు అప్పుల పాలవుతున్నారు. కొందుర్గు మండలంలో 23 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 2 ఉన్నత పాఠశాలలకు గాను దాదాపు 3 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ పాఠశాలలకు గాను 70 మంది ఏజెన్సీ సభ్యులు పనిచేస్తున్నారు. అయితే వీరికి కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వెయ్యి రూపాయలు అక్టోబర్ నుంచి అందడం లేదు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 2వేల రూపాయలు గత జూన్ నెల నుంచి రావడం లేదని ఏజెన్సీ సభ్యులు వాపోతున్నారు. ఇక వంట సరుకుల బిల్లులు రాక మూడునెలలు కావొస్తుందని చెబుతున్నారు. దీంతో విద్యార్థులకు అందించాల్సిన భోజనం నాణ్యత లోపిస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ఆరునెలలు కావొస్తుంది**

అసలే రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. గుడ్డు మార్కెట్ ధర ఎనిమిది రూపాయలు ఉంది. సర్కారు ఇచ్చేది అయిదు రూపాయలు, అవి సమయానికి రావు. ఇలాగైతే ఎలా చేయాలి. అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నాం.

– సుజాత, ఏజెన్సీ సభ్యురాలు, కొందుర్గు జెడ్పీహెచ్ఎస్

### బిల్లులు అందక.. వెతలు తీరక

శంకర్‌పల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అక్షయపాత్ర వారు అందిస్తున్నారు. మండలంలోని కొండకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు నియమించిన సిబ్బందికి బిల్లులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుండగా.. ప్రతి రోజు సన్న బియ్యంతో వండిన అన్నం, కర్రీలు, సాంబారు అందిస్తున్నారు. అక్షయ పాత్ర వారు గుడ్డు, అరటిపండ్లకు బదులుగా వారానికి మూడుసార్లు అల్పాహారం పంపుతున్నారు. పాఠశాలలోని విద్యార్థులకు ఫిల్టర్ వాటర్‌తో తాగునీటిని అందిస్తున్నారు. రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించాలని కిందిస్థాయి ఉద్యోగులు కోరుతున్నారు.



కొండకల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

### ముద్దగా అన్నం..



పోతుగల్ ఉన్నత పాఠశాలలో ముద్దలాగా వండిన అన్నం

షాబాద్: మండల పరిధిలోని పోతుగల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులను ఆరా తీయగా అంతంత మాత్రమే అని చెప్పారు. అన్నం మెత్తగా వండుతున్నారు. నీళ్ల చారు పోస్తున్నారని మెనూ పాటించడం లేదని చెప్పారు. గుడ్డు, అరటి పండు ఒకసారి మర్చిపోతున్నారు. కొత్త బియ్యం పంపిణీ చేయడంతో అన్నం మెత్తబడుతుందని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఏజెన్సీలకు బిల్లులు డిసెంబర్ వరకు అందజేశారు. జనవరి నెల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో మూడునెలల టిఫిన్ బిల్లులు అందలేని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటగదులు లేక శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంలో వంట చేస్తున్నామని, గ్యాస్ లేక కట్టెల పొయ్యిపైనే వండుతున్నామన్నారు. మాకు వంట గది నిర్మించాలని కోరుతున్నారు. ఫిల్టర్ నీరు లేక విద్యార్థులు ఇంటి నుంచి ప్లాస్టిక్ వాటర్ బాటిల్లో తెచ్చుకుని తాగుతున్నారు.

### రుచి అంతంతే..



అజీజ్‌నగర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వేచి ఉన్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా ఉందని ఆయా పాఠశాలల విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం అక్షయ పాత్ర ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న మధ్యాహ్నం భోజనం రుచికరంగా లేకపోవడంతో విద్యార్థులు తమ ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకొని తింటున్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 6–10వ తరగతి వరకు 455 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో కేవలం 50 శాతమే అక్షయ పాత్ర భోజనాన్ని ఆరగిస్తున్నారు. మిగతా వారంతా ఇళ్ల నుంచి టిఫిన్‌లు తెచ్చుకొని తింటున్నారని పేర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన మెనూలో ఉన్న వాటిని సక్రమంగా అందించలేకపోవడం గుడ్లు, అరటి పండ్లు అసలే అందించడం లేదని చెబుతున్నారు. అన్నం ఉడికీ ఉడకనట్లు ఉంటుందని, ప్రభుత్వం అక్షయ పాత్ర కాకుండా ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం వండే పథకాన్ని ప్రారంభించాలని పేర్కొంటున్నారు.

**కూరలు రుచికరంగా లేవు**



పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిగా ఉండడం లేదు. సప్పగా ఉండడం పండ్లు, గుడ్లు అసలే ఉండవు. దీంతో ఇంటి నుంచి టిఫిన్ తెచ్చుకొని తింటున్నాం. ఈ భోజనం కంటే ముందు పాఠశాలలో వండేటప్పుడు ఎంతో రుచికరంగా, వేడిగా ఉండేవి. ప్రభుత్వం ఆలోచించి మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలోనే వండి సరఫరా చేసే విధంగా చూడాలి.

– భవానీ, 6వ తరగతి, అజీజ్‌నగర్

### ఒకటే మిక్స్‌డ్ కర్రీ



ఊరేళ్ల పాఠశాలలో మిక్స్‌డ్ కూరగాయలను పప్పుతో కలిపి ఒకటేగా వండిన కూర

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం బాగున్నా దీని అమలు తీరులో ఉన్న వ్యత్యాసాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళవారం చేవెళ్ల మండలంలోని ఊరేళ్ల గ్రామంలో గల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు సాంబర్, మిక్స్‌డ్ కూరగాయల కూర ఉండాలి కానీ మిక్స్‌డ్ కూరగాయలతో చేసిన కర్రీనే పప్పుగా ఒకే కర్రీ చేశారు. అన్నంతో పాటు కర్రీ ఒక్కటే వడ్డించారు. వారంలో మూడు సార్లు గుడ్డు ఇవ్వాల్సి ఉండగా.. వారంలో రెండు రోజులు అందిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఊరేళ్ల ప్రాథమిక పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉండగా.. ఉన్నత పాఠశాలలో 114 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల్లో 90శాతం మంది మధ్యాహ్న భోజనం తింటున్నారని, కొంతమంది భోజనం పడటం లేదని టిఫిన్ తెచ్చుకుంటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. భోజనం బాగానే వండుతున్నారని, కూరగాయులు కూడా రోజు రోజు వేర్వేరుగానే చేస్తున్నట్లు చెప్పారు. వంట ఏజెన్సీకి రావాల్సిన బిల్లులు సకాలంలో రాని సమయంలో మాత్రం మెనూ ప్రకారం భోజనం, గుడ్డు అందించటంలో అటూ ఇటూగా మారుతుంటాయని ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. మండలంలో 64 పాఠశాలలకుగాను 17 పాఠశాలల్లోనే ఏజెన్సీల ద్వారా మధ్యాహ్న భోజనం పెడుతుండగా.. 47 పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా భోజనం అందిస్తున్నారు. ఏజెన్సీలకు సక్రమంగా బిల్లులు అందిస్తే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

### ఒక్కటే వండుతారు



ఉదయం రాగిజావ, మధ్యాహ్న భోజనం పెట్టారు. గుడ్డు వారంలో ఒక్కోసారి రెండు, మూడు సార్లు ఇస్తారు. కర్రీ ఒక్కటి వండుతారు. అరటిపండు అప్పుడప్పుడు మాత్రమే ఇస్తారు. భోజనం బాగానే ఉంటుంది. అందరం స్కూల్లోనే తింటాం.

– రామ్‌తేజ్, విద్యార్థి, ఊరేళ్ల

## రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



అప్పోజీగూడ సమీపంలో కంకరతో తాత్కాలికంగా పూడ్చిన గుంతలు

మొయినాబాద్: ఒకప్పుడు ముఖ్యమంత్రి ఏ ఊరికైనా వస్తున్నారంటే ఆ ఊరి రోడ్లు వెంటనే బాగుపడేవి. సీఎం వెళ్లే రూట్‌లో రోడ్లు గుంతమయంగా ఉంటే రీబీటీ వేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖ్యమంత్రి వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగానే ఉంటుంది. ఎక్కువ గుంతలు ఉన్నచోట అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పొద్దటూరు రెవెన్యూలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియం పార్కు ప్రారంభోత్సవానికి మొయినాబాద్‌లోని చిలుకూరు రోడ్డులో వెళ్లారు. అయితే చిలుకూరు నుంచి వీరన్నపేట వరకు రోడ్డు అక్కడక్కడా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. సీఎం వస్తున్నారని నాలుగురోజుల నుంచి ప్రచారం జరుగుతున్నా అధికారులు రోడ్డు పరిస్థితిని పట్టించుకోలేదు. సీఎం రాకతో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి అధికారులు ఉరుకులు పరుగులు పెట్టి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కంకర పోసి నింపారు. అధికారులు హడావిడిగా చేసిన తాత్కాలిక మరమ్మతులపై స్థానికులు చర్చించుకుంటున్నారు. గుంతల్లో పోసిన కంకర రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.

## అవగాహన లేమితో మాట్లాడటం సరికాదు

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ నాయకులు కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే దక్కుతుందన్నారు. పదేళ్ల కాలంలో నిస్వార్థంగా పనిచేశారని, అక్రమ ఆస్తులను కూడ గట్టుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన పనులకు శంకుస్థాపనలు చేస్తూ కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. అదేవిధంగా ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ఫరూఖ్‌నగర్ పాఠశాల అభివృద్ధి విషయంపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ చేయాలని సవాల్ విసిరారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వారి కుమారుల గురించి కాంగ్రెస్ నాయకులు తప్పుగా మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు గుండు అశోక్, జూపల్లి శంకర్, మన్నె నారాయణ, చీపిరి రవి సుధాకర్, పిల్లి శేఖర్‌పులిజాల నవీన్‌కుమార్, , గుడ్డు యాదవ్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


### పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం మేడ్చల్‌కు చెందిన న్యాయవాది వాసుదేవరాజు, స్వాతి దంపతులు మైక్‌సెట్(సౌండ్ సిస్టమ్), విద్యార్థులకు డ్రై ఫ్రూట్స్ లడ్డూలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సక్కుబాయి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దానగుణాన్ని అలవర్చుకొని, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దాతను పూలమాలలు, శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీపీఎస్‌ను రద్దు చేయాలి

కొందుర్గు: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ సంఘం సభ్యులు మంగళవారం తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారని, తెలంగాణలోనూ అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పాఠశాల పునర్నిర్మాణానికి సహకారం



విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిన్నచిల్కమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పునర్నిర్మాణానికి పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. పూర్వ విద్యార్థి కొత్త చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం పూర్వవిద్యార్థులు తమవంతు సహాయంగా రూ.3లక్షల 2వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మాట్లాడుతూ.. మన బడిని మనమే బాగుచేసుకోవాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థులు తమవంతుగా విరాళాలను ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, పూర్వ విద్యార్థులు యాదగిరి, సత్యం, పల్లె నర్సింహారెడ్డి, యాదయ్య, పెంటయ్య, నర్సింహ, శ్రీశైలం, భూపతిరెడ్డి, వీరయ్య, శ్రీనివాస్, మహేశ్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ఎంవీఐ వాసు ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను అరికట్టాలంటే వాహనదారుల్లో చైతన్యం రావాలన్నారు. ప్రతీ వాహనదారుడు విధిగా రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడినవారు ఎందరో ఉన్నారన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే.. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగిన ఘటనలే అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌పోర్టు శాఖ డిప్యూటీ కమిషనర్ సదానందం మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు రోడ్డు రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్సులు లేకుండా, వాహనదాల ధ్రువపత్రాలు లేకుండా ఎవరూ వాహనాలు నడిపించొద్దన్నారు. సామర్థ్యానికి మంచి అధికంగా ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకోవద్దన్నారు. ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ బలరాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సయ్యద్ సాధిక్, రఘునాయక్, బస్వం, ఇబ్రహీం, బాల్‌రాజ్, రవికుమార్, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీను, సీతారాం, అశోక్, విజయేందర్, లక్ష్మణ్, శంకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయింపు



ప్రిన్సిపాల్‌కు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామం అలీసాబ్‌గూడ గ్రామ శివారులో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి మంగళవారం ప్రభుత్వం స్థలం కేటాయించింది. అలీసాబ్‌గూడ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 21లో సెరీకల్చర్ శాఖకు సంబంధించిన 3 ఎకరాల స్థలాన్ని పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం జీఓను జారీ చేసింది. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. భూమి కేటాయింపు పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక తహసీల్దార్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సర్వే పనులు కూడా పూర్తిచేశారు. ఈ సందర్భంగా కళాశాలకు భూమిని కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు.